సీనియర్ పాత్రికేయులు పీఏ పంతులు మృతికి సంతాపం

విశాలాంధ్ర - టెక్కలి : టెక్కలిలో చాలా ఏళ్లుగా జర్నలిస్ట్ రంగంలో మచ్చలేని వ్యక్తిగా పేరుగాంచిన సీనియర్ జర్నలిస్ట్ పిఏ పంతులు (90) సోమ వారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల విశాలాంధ్ర విశాఖపట్నం ఎడిషన్ మేనేజర్, సీనియర్ జర్నలిస్ట్ సనపల నరసింహులు తమ ప్రగడ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలిలో ఆయన తొలితరం జర్నలిస్టుగా పనిచేశారని, 5 సంవత్సరాలుగా విశాలాంధ్ర పత్రికలో పని చేశారని, ఆయన సేవలు ఎప్పటికీ మరువలేమని అన్నారు. పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తూ టెక్కలి కేంద్రంగా ఆర్ఎంపి వైద్యుడుగా రక్త పరీక్షలు జరిపి ల్యాబ్ ఏర్పాటు చేసి ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతి తెలిపారు.

శ్రీకాకుళం నగరం చుట్టూ ఓఆర్ఆర్ : రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరం చుట్టూ ప్రతిపాదిత ఓఆర్ఆర్ (అవుటర్ రింగ్ రోడ్డు) నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఏడాదిలో పనులు మొదలు పెట్టేలా ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలసి శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, దేవాదాయ, గనులు భూగర్భ, కొవ్వాడ తదితర ముఖ్య శాఖల జిల్లా ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

- ఓఆర్ఆర్ కు 542 ఎకరాలు అవసరం... జిల్లా కేంద్రం చుట్టూ 36 కి.మీ పొడవునా 200 అడుగుల వెడల్పుతో 18 గ్రామాలను కలుపుతూ ఓఆర్ఆర్ నిర్మాణం చేపడతామని, ఇందుకోసం 542 ఎకరాల భూ సేకరణ చేయాల్సి వుందని, ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకుని ప్రజాభిప్రాయ సేకరణ చేసి ముందుకు వెళ్లాలని సూచించారు. శ్రీకాకుళం కార్పొరేషన్ కు ప్రస్తుత ఉన్న కార్యాలయ భవనం స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్ తో కూడిన నూతన కార్యాలయాన్ని నిర్మించాలని చెప్పారు. డే నైట్ కూడలి నుంచి 7 రోడ్ల కూడలి వరకూ రోడ్డు మధ్యలో ఉన్న మొక్కలను వెంటనే తొలగించి ఆహ్లాదాన్ని ఇచ్చే మొక్కలను నాటాలని, అలాగే సబ్ సర్ఫేస్ డైక్ నుంచి రెల్లి వీధి వరకూ నాగావళి నదికి కరకట్ట నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ తో సమన్వయం చేసుకొని యంత్రాంగం పనిచేయాలని సూచించారు..

- మిర్తి బట్టీ పనులు మొదలు పెట్టాలి... నగరంలో నీరు నిలిచి పోకుండా వెంటనే 7.5 కి.మీ మేర మిర్తి బట్టీ, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు. గతంలో 20శాతం పనులు మాత్రమే జరిగాయని అధికారులు పేర్కొనడంతో వెంటనే అంచనాలు సవరించి టెండర్లు పిలవాలన్నారు. డే నైట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ 80 అడుగుల వరకూ రోడ్డు విస్తరించాలని, బలగ వరకూ విస్తరణ పనుల్లో నష్టపోయిన వారికి టి.డి.ఆర్ లు ఇవ్వాలని సూచించారు. పాత్రునివలస, పెద్దపాడులలో మంచినీటి సరఫరా పనులకు రూ.24 కోట్లతో పనులు మొదలు పెట్టాల్సి ఉందని, రిజర్వ్ సైట్ లలో పార్కులు ఏర్పాటు చేయాలని అన్నారు. గడచిన నెలన్నర రోజులుగా రూ కోటి ఖర్చుతో మరుగు కాలువల్లో పూడిక తీత పనులు చేస్తున్నట్లు కమిషనర్ ఓబులేసు తెలిపారు. విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి బాటలు వేయాలని, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో జిల్లా కేంద్రంలో అభివృద్ధికి అవకాశం ఉన్న పనులకు కేంద్రం నుంచి నిధులు విడుదల చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

- అరసవిల్లి కి కొత్త రోడ్డు... అరసవిల్లి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌలభ్యం కోసం ఇంద్ర పుష్కరిణి వెనక నుంచి కొత్త మార్గాన్ని ప్రతిపాదించాలని ఆదేశించారు. దేవాలయ ఆధీనంలో ఉన్న దుకాణాలకు వేలంపాట నిర్వహించాలని, అనధికార ఉద్యోగాలు చేస్తున్న 48 మందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. దేవాలయ మాస్టర్ ప్లాన్ -2018 పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రసాదం పథకం కింద జిల్లాలో ప్రాభవం ఉన్న దేవాలయాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. శ్రీకూర్మం పుష్కరిణి దారుణంగా ఉందని, దాన్ని సుందరీకరించాలని ఆదేశించారు.

- ఇసుకపై ఉదాసీనత వద్దు... ఇసుక పై ప్రభుత్వం నూతన పాలసీ ప్రకటించే వరకూ అక్రమ ఇసుక అనే మాటే రాకూడదని గనులు భూ గర్భ శాఖ అధికారులను హెచ్చరించారు. అక్రమ క్వారీలు, అక్రమ ఇసుక రాంపులపై ప్రతిరోజూ దాడులు చేయాలని, రాత్రి వేళల్లో విశాఖ వెళ్లే అక్రమ ఇసుక లారీలను సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు అక్రమ ఇసుకపై పత్రికల్లో వార్తలు వస్తుండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు.

- కొవ్వాడ సమస్యలు పరిష్కరించాలి... కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించి స్థానికుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని సత్వరమే ఆయా సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. యూత్ ప్యాకేజీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, అణు పార్క్ ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావును సమన్వయం చేసుకొని అధికారులు పనిచేయాలని సూచించారు.

- ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి... శ్రీకాకుళం నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడంలో చొరవ తీసుకోవాలని, వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అడిషనల్ ఎస్పీ ప్రేమ కాజల్ ను ఆదేశించారు. పార్కింగ్ పేరుతో ట్రాఫిక్ పేరుతో కేసులు పెట్టి ఇబ్బంది పెట్టరాదన్నారు. తాను గతంలో మంత్రిగా బీసీ భవన్ కోసం రూ.5 కోట్లు మంజూరు చేసానని దాని ప్రస్తుత స్థితి, అలాగే కొవ్వాడ అణు విద్యుత్ కేంద్ర నిధులకు వచ్చిన వడ్డీ ని ఏపి అవసరాల కోసం ఖర్చు చేశారనే విషయాలను తనకు తెలియజేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. సమీక్షకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్ ఈశ్వరరావు, ఆర్డీవో సిహెచ్ రంగయ్య, మున్సిపల్ ఇంజనీరింగ్ ఈఈ సుగుణాకర రావు, అరసవెల్లి డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్ర శేఖర్, కొవ్వాడ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీనారాయణ, గనులు భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. సత్యనారాయణ హాజరయ్యారు.

పర్యావరణ హితము కోసం నగేష్ కాలినడకన..

పలాస చేరుకున్న నగేష్‌తో మొక్కలు నాటిన గ్రీన్ ఆర్మీ

విశాలాంధ్ర - పలాస : గో గ్రీన్ అంటూ పర్యావరణ హితం కోసం చెన్నై నుండి విజయవాడ మీదుగా పూరి వరకు నడక ప్రయాణం సాగిస్తున్న నగేష్ యువతకు ఆదర్శం, స్ఫూర్తిదాయకం. విజయవాడలో ఇంజనీరింగ్ చదువుతున్న నగేష్ పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలంటూ నినాదంతో తమిళనాడు చెన్నై నుండి కాలి నడకను ప్రారంభించారు.ఇప్పటి వరకు1200 కిలోమీటర్లు నడకను పూర్తి చేసుకొని సోమవారం రాత్రి పలాస చేరుకున్నారు. నగేష్ కు పలాస కాశీబుగ్గ చెందిన గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, సభ్యులు స్వాగతం పలికారు. మంగళవారం పలాస నుండి బయలుదేరిన నగేష్ తో జాతీయ రహదారి కోసంగిపురం వద్ద మొక్కలను నాటించారు. నగేష్ తన ప్రయాణంలో ప్రతి పది కిలోమీటర్లకు విత్తనాలను వెదజల్లుతూ పర్యావరణం కోసం అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెలగోపాల్ మాట్లాడుతూ పర్యావరణ కోసం నగేష్ వలే యువత అంతా ముందుకు వచ్చి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. యువతే దేశానికి వెన్నెముకని వారికి ఇష్టమైన పని ఏదైనా స్ఫూర్తి నింపేదిగా ఉండాలని తద్వారా సమాజానికి మేలు జరిగే విధంగా యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ సభ్యులు పలాసవాసి దిలీప్, సంతోష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘ భవనాన్ని అప్పగించండి

ఎమ్మెల్యే, రమణమూర్తికి స్వర్ణకారులు విజ్ఞప్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో బండివీధి సమీపంలో వున్న స్వర్ణకారుల సంక్షేమ సంఘ భవనాన్ని మాకు అప్పగించాలని పట్టణ స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, అద్దంకి మోహనరావు(మున్నా), కార్యదర్శి, లక్కోజు విశ్వనాధం కోరారు. ఈ విషయమై మంగళవారం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తికి మబగాం గ్రామంలో స్వర్ణకారులు కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. అనంతరం సంఘం అధ్యక్షులు, అద్దంకి మోహనరావు మాట్లాడుతూ 2014వ సంవత్సరంలో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మీరు పట్టణంలో స్వర్ణకారులకు పంచాయితీ పరిధిలో వున్న ఈ స్థలాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు చేశారని, ఈ స్థలంలో మా స్వర్ణకారుల సంఘంలో వున్న ప్రతినిధులంతా భవనాన్ని నిర్మాణం చేసుకొని, సంఘ అవసరాలకు ఉపయోగిస్తున్నామని తెలిపారు. అయితే పెద్దపేట వీధికి చెందిన ఒక వ్యక్తి ఈ సంఘ భవనాన్ని కోర్టులో కేసు వేసి, స్వాధీనం చేసుకున్నారని అన్నారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం కేటాయించిన ఈ భవనాన్ని తిరిగి మాకు అప్పగించాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ ఈ సంఘ భవనాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపటిసి, తాళాభక్తుల గోవిందరావు, స్వర్ణకారుల సంక్షేమ సంఘ ప్రతినిధులు, లక్కోజు రామకృష్ణ, సిహెచ్.రమణ మూర్తి, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు పిఎం జన్మన్ హాస్టల్స్ మంజూరు : ఏంఈఓ

విశాలాంధ్ర - హిరమండలం : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలానికి మంజూరైన రెండు పీ.ఎం జన్మన్. హాస్టల్స్ నిర్మాణానికి స్థల సేకరణ పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కె. రాం బాబు మంగళవారం తెలిపారు. మంగళవారం జిల్లా సమగ్ర శిక్ష ఏ ఎల్ .ఎస్. కో.ఆర్డినేటర్, పూడి జనార్ధన్ రావు తో కలిసి, స్థల సేకరణ చేసిన భూమిని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఈ హాస్టల్స్ లో ఒకటి మండలంలో గల శుభలయ రెవిన్యూ పరిధిలో కేటాయించాలని ప్రభుత్వం సూచించినప్పటికీ అక్కడ ప్రభుత్వ స్థలం లేకపోవడంతో శుభలయ కీ సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న గులుమూరు రెవిన్యూ గ్రామం సర్వే నెంబరు 133 లో ఉన్న ఎకరా 20 సెంట్లు ప్రభుత్వ భూమిని పీఎం జన్మన్ హాస్టల్ కు కేటాయించడం జరిగిందని ఎంఈఓ రాంబాబు తెలిపారు. అదేవిధంగా రెండవ హాస్టల్ ను సీది రెవెన్యూ గ్రామ పరిధిలో పరిశీలించాలని సూచించినప్పటికీ అక్కడ కూడా కావలసిన ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఈ గ్రామానికి సమీపంలో గల గొడియపాడు రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 76 లో సుమారు ఎకరా ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ఎంపిక చేసి స్థల సేకరణ పూర్తి చేయడం జరిగిందని ఎంఈఓ రాంబాబు తెలిపారు. ఈ రెండు హాస్టలకు స్థల సేకరణ పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదిక అందిస్తున్నట్లు ఎంఈఓ రాంబాబు తెలిపారు. ఈ స్థల పరిశీలనలో ఏ.ఎల్.ఎస్ ఆర్డినేటర్ పి జనార్ధన్ రావుతో పాటు రెవెన్యూ అధికారులు సిఆర్ఎంటి బి.గోవిందరావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్సీ భవనంలో ఎంఆర్సి సిబ్బంది మరియు సి.ఆర్.ఎం.టి.లతో ఏ .ఎల్. ఎస్. కోఆర్డినేటర్ జనార్ధన్ రావు మరియు ఎంఈఓ రాంబాబు లు సమీక్ష నిర్వహించారు.

శ్రీ వెంకటేశ్వర పశువైద్యవిశ్వవిద్యాలయం ప్రత్యేక పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : శ్రీ వెంకటేశ్వర పశువైద్యవిశ్వవిద్యాలయంనకు చెందిన పశుసంవర్ధక పాలిటెక్నికల్ కళాశాల వారి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తారీకు నుండి 16వ తారీకు వరకు జరిగే ప్రత్యేక సేవా పథకం కార్యక్రమంలో భాగంగా ఈ రోజు షలాంత్రి గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాలా సూర్యానారాయణ మాట్లాడుతూ ఈ వారం రోజులు జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలని, ఈ వర్షకాలంలో విపరీతమైన అంటువ్యాదులు ప్రబలే అవకాసం ఉందని ప్రతీ రైతు వైద్యులు సూచనలను పాటించాలని అన్నారు. అనంతరం గర్భకోశ వ్యాధులు మరియు ఇతర పశు వ్యాదులకు చికిత్స అందించడం జరిగింది. అదేవిదంగా దూడలకు నట్ట నివారణ మందులు పట్టడం జరిగింది. రైతులకు వివిధ పశువ్యాదులపై అవగాహనా కల్పించారు. అలాగే వివిధ వ్యాధులకు సంబంధించి మందుల పంపిమని చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల డాక్టర్ ఆర్.వి.రమణమూర్తి పశుసంవర్ధక అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్ మోహన వంశి, పశువైద్యులు డాక్టర్ సతీష్, పైడిరాజు, గ్రామా సర్పంచ్ బత్తిని వరలక్ష్మి, కోవిళాపు చంద్రశేఖర్, బత్తిని గరికినాయుడు, మరియు ద్వితీయ సంవత్సరం శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : గ్రామంలో గల ప్రజా సమస్యల పరిష్కారానికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మండలం గోవిందపురం మాజీ పి హెచ్ సి చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణలు అన్నారు. మంగళవారం గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండడానికి ముందస్తు చర్యగా మురుగు కాలువలు శుభ్రం చేయించారు. పూడికతో నిండి, మురుగునీరు సక్రమంగా వెళ్ళకపోవడంతో దుర్వాసన, దోమలు, ఈగలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తెలిసి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రమణ మాట్లాడుతూ ఎమ్మెల్యే శిరీష సూచనలతో రానున్న కాలంలో ప్రతి వీధికి కొత్త డ్రైనేజీ కాలువలు నిర్మాణాలు చేపడతామని చెప్పారు. ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద పారిశుధ్యం పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని ఇంటి చుట్టు శుభ్రంగా ఉంటేనే మనం మంచి ఆరోగ్యంగా ఉంటామని అని సూచించారు. ఇంట్లో నీటి నిల్వలు ఉంచకుండా చూడాలని అన్నారు. ఆరోగ్యవంతమైన కుటుంబాల కోసం ప్రతి కుటుంబం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ చైర్మన్ కర్ని శ్రీను, పాలిన మోహనరావు, కృష్ణార్జున బృందం సభ్యులు సారథి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురజాపు రాముకే రాష్ట్ర రజక ఫెడ్రేషన్ పదవి కేటాయించాలి

విశాలాంధ్ర - రణస్థలం : మండలం రజక సంఘం మండల అధ్యక్షుడు దమరసింగి మహాలక్షము, కమిటి సభ్యులు అంతా కలిసి మంగళ వారం మండల కేంద్రంలో సమావేశం నిర్వ హిం చడం జరిగింది. ఈ సందర్భంగా మహాలక్షము మాట్లాడుతూ టీడీపి విజయనగరం పార్లమెంట్ రజక సాధికారిక కమిటి కన్వీనర్ గురజాపు రాము టిడిపి పార్టీ తరుపున జయహో బీసీ స్టార్ కంపెనర్‌గా సేవలు చేస్తు, రజక సంఘాలకు అభివృద్ధికి కూడా గత పాతికేళ్లుగా కృషి చేస్తున్నారని, తన మాటకు రజకులు అందరూ కట్టుబడి ఉన్నారన్నారు. అందువలన రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్మన్ పదవి కేటాంచాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాము కు అవకాశం ఇస్తే వెనుకబడి వున్న 3 జిల్లాల రజకులు బాగుంటారని నమ్ముతున్నామని అందువల్ల ఒక్క అవకాశం ఇవ్వాలని కోతున్నామన్నారు. ఈ కార్యక్రమం లో రజక నాయకులు బి.మహాలక్షుము నాయుడు, బి.సూర్యనారాయణ, బి.కృష్ణ, ఎన్.అసిరప్పడు, డి. ఆదినారాయణ మిగతా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - టెక్కలి : ప్రభుత్వ స్థలం అయినటువంటి బంధ ను కొందరి వ్యక్తులు ఆక్రమించు కున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి మోర్చ జిల్లా(గిరిజన) అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిభారికి లింగరాజు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం టెక్కలి తహసిల్దార్ దిలీప్ చక్రవర్తి కి బిజెపి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు తహసిల్దార్ తో మాట్లాడుతూ టెక్కలి మండలం మండలం మేఘవరం పంచాయతీ వంగర గ్రామ సమీపంలో ప్రధాన వీధికి ఉత్తర దిశలో సుమారు 35 సెంట్లు స్థలం గల బంధ ను పులిబంధ పెంటమ్మ వారి కుటుంబ సభ్యులు ఆక్రమించుకొని దాన్ని సాగులోకి తెచ్చి పొలంగా మార్చి 2 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్నారని వివ రించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణ అవకూడదు అనే ఉద్దేశంతో మీకు తెలియ పరిచామని అన్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించి వెంటనే ఆక్రమణదారుల పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎచ్చెర్ల ఎమ్మెల్యేను కలసిన యూనివర్శిటీ రిజిస్ట్రార్

విశాలాంధ్ర - రణస్థలం : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ఎచ్చెర్ల అంబేద్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుజాత ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)నీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించి యూనివర్శిటీ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సామాన్యుల కన్నా దివ్యాంగులకు మంచిగా చూడాలి...

సివిల్ జడ్జి ప్రసన్న లత

విశాలాంధ్ర - జలుమూరు : సామాన్యుల కన్నా దివ్యాంగుల పిల్లలకు అమోఘంగా ఆదరించాలని కోట బొమ్మాళి న్యాయమూర్తి బి.ఎం ఆర్ ప్రసన్న లత అన్నారు. మంగళవారం మండల కేంద్రం జలుమూరు భవిత కేంద్రాన్ని సందర్శించి మానసిక శారీరక వైకల్యం గల పిల్లలు ఉండే కేంద్రాన్ని స్వయంగా పరిశీలించారు. అక్కడ స్థితిగతులు వాళ్ళకి ప్రభుత్వం ద్వారా కల్పించిన పథకాలను వారికి అందేలా చూడాలని అక్కడ సిబ్బందిని సూచించారు. మానసిక రుగ్మతలు పుట్టుకతో కొందరికి వస్తాయని కొన్ని జీన్స్ లోపా ల వలన రావచ్చని ఆమె అన్నారు. నలుగురితో పాటు కలసి మెలసి మంచి జీవనాన్ని గడిపేలా మనందరం చూడాలని ఆమె కోరారు. ఆమెతో పాటు న్యాయవాదుల సంఘ అధ్యక్షులు లకినేని శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు, ఎంవిఆర్ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ఖాళీల భర్తీకి నేరుగా ప్రవేశాలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి బుధవారం నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ఎస్సీ 5 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఎస్టీ, ఓసీలకు చెరొకటి, బైపీసీలో ఎస్టీలకు 3 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి, రిజర్వేషన్ ప్రాప్తికి నేరుగా సంప్రదించాలన్నారు.

విధ్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలి

జిల్లా ఏ.ఎస్.పి, డా.ప్రేమ్ కాజల్

విశాలాంధ్ర - నరసన్నపేట : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి అవసరాల కోసం వాడుకోవాలని జిల్లా ఏ.ఎస్.పి, డా.ప్రేమ్ కాజల్ అన్నారు. మంగళవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ లోన్ యాప్‌ల పట్ల, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా వుండాలని, అలాగే విద్యార్థినులకు పోలీస్ వ్యవస్థ రక్షణ ఉంటుందని అన్నారు. అలాగే సివిల్స్ గ్రూప్ పరీక్షలకు డిగ్రీ ప్రధమ సంవత్సరం నుండే సిద్ధం కావాలని అనవసర భయాలు తొలిగించుకుంటేనే పరీక్షల్లో విజయం సాధించగలమని తెలిపారు. అనంతరం కళాశాల డైరక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో భాగంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సంబంధించి సిలబస్‌పై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండేలా విభిన్న కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే సర్కిల్ ఇన్‌స్పెక్టర్, శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయాలు కల్గివుండాలని, పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో, మెండ మోహన్‌దాస్‌నాయుడు, ఎకడమిక్ ఇంఛార్జ్, ఎం.శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - మందస : మండలంలో అపరిష్కృతంగా ఉన్న గిరిజన సమస్యలు పరిష్కరించాలని మందస మండల ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షులు సవర జగన్ కోరారు. సీతంపేట ఐటిడిఎ పి.వో టి.రాహుల్ కుమార్‌రెడ్డికి ఈ మేరకు వినతి పత్రం చీపి గ్రామంలో అందజేశారు. నువగాం గ్రామంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, కొండలోగాం పంచాయతీలో గిరిజనులు సాగు చేస్తున్న భూములు గిరిజనేతరులు ఆక్రమించారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల గిరిజనులకు కొండపోడు పట్టాలు మంజూరు చేయాలని, విద్యుత్ షాక్‌తో మరణించిన బావనపురం గిరిజనుడు సవర కామేసు కుటుంబానికి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని, చీపి పంచాయతీలో వంతెనలు మంజూరు, చేసి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సవర సోమేష్, కుమారస్వామి, పూర్ణచంద్ర, ధర్మారావు, శంకర్, శివలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు ఆయన పొన్నాడ. మురపాక, రణస్థలం ? కేజీబీవీలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, వంటగదిని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు, బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే

ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల/అరసవల్లి : అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే నని ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారిని నమ్ముకున్న వారికి అంతా శుభమే జరుగుతుందన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు రామ గుండం నియోజకవర్గ ప్రజలపై ఉండి వారంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముకల్ల భాస్కరరావు, మెండ రాజారావు, జరుగుళ్ల శంకర్రావు పాల్గొన్నారు.

పరిశ్రమకు చెందిన కార్మికుడు మృతి

విశాలాంధ్ర - రణస్థలం : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై యూబి పరిశ్రమకు చెందిన కార్మికుడు పతివాడ సన్యాసినాయుడిని లారీ ఢీ కొట్టింది. మంగళవారం విశాఖ నుండి శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ ఢీ కొనడం తో నుజ్జు నుజ్జు అయిపోవడం జరిగింది. వెంటనే యూబీ పరిశ్రమ చెందిన అంబులెన్స్ పై శ్రీకాకుళం తరలించారు. పరిశ్రమలో ఏ షిఫ్ట్ విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై లావేరు మండలంలోని ఇజ్జాడపాలెం ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. జెఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఆటలు పోటీలు

విశాలాంధ్ర - కవిటి : పంద్రాగస్టు సందర్భంగా కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా మంగళ వారం ముమ్మరంగా విద్యార్థులకు క్రీడలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు కబాడీ, ఖో- ఖో,మ్యూజికల్ చైర్,బాలురకు కబాడీ, ఖో - ఖో, క్రికెట్, బాలబాలికల వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు.

ఐతమ్‌ను వరించిన ప్రతిష్టాత్మక ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్

విశాలాంధ్ర - టెక్కలి : భారత ప్రభుత్వ ఉన్నత విద్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధానో చేతులు మీదగా సోమవారం సాయంత్రం 2024 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాలల ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కళాశాల (ఐతమ్) దేశంలో 201 నుండి 300 మధ్యలో ర్యాంక్ కు ఎంపిక కావడం ఎంతో గర్వకారణంగా ఉందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్రంలో ఈ ర్యాంక్ కు 13 ఇంజినీరింగ్ కళాశాలలు ఎంపిక కాగా ఉత్తరాంధ్రలో కేవలం మూడు కళాశాలలకు చోటు దక్కిందని అన్నారు. ఆ మూడిటిలో ఐతమ్ ఒకటి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న బోధన సిబ్బంది విద్యార్హత, పరిశోధన పత్రాలు సమర్పణ, విద్యార్థులకు ఏటా లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కళాశాలలో ఉన్న ల్యాబ్స్, గ్రంథాలయం, తరగతి గదులు, ఇతర మౌలిక వసతులు, విద్యార్థులు మరియు అధ్యాపకులు నిష్పత్తి సంఖ్య, విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, విద్యార్థులను ప్రోత్సహిస్తూ కళాశాల అందిస్తున్న ఉపకార వేతనాలు వంటి ప్రధాన అంశాలను పరిగణలోకి తీసుకొని దేశవ్యాప్తంగా ర్యాంకింగ్ ను నిర్ధారించారని తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ యొక్క ప్రయోజనాలు గురించి తెలుపుతూ ఎన్ఐ ఆర్ఎఫ్ ర్యాంకు వల్ల కంపెనీల దృష్టి కళాశాల మీద పడుతుందని దాని ఫలితంగా అత్యధిక ప్యాకేజీలతో విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. అనేక ప్రభుత్వ రంగం సంస్థల నుండి పరిశోధనకు నిధులు కళాశాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. యూని వర్సిటీకి వెళ్లాలనుకునే వారికి ఈ ఎన్ఐ ఆర్ఎఫ్ ర్యాంకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుందని తెలిపారు. అలాగే ఈ ర్యాంకు వల్ల దేశవ్యాప్తంగా ఐతమ్ అందిస్తున్న జ్ఞాన్యమైన విద్య ప్రమాణాలు పట్ల ఒక గుర్తింపు వచ్చిందన్నారు. వెనకబడి ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాల్లో రెండు దశాబ్దాల క్రితం స్థాపించిన ఐతమ్ ఎన్నో ప్రతిష్టాత్మక ర్యాంకులు సాధించినప్పటికీ కేంద్రం ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఎన్ఐఆర్ఎఫ్ వంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన ర్యాంకింగ్ లో ఎంపిక కావడం పట్ల డైరెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి విజయం యాజమాన్యం సిబ్బంది, తలిదండ్రులు విద్యార్థుల సమిష్ఠ కృషి వల్లే ఈ విజయం సాధించడం జరిగిందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో కళాశాల కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, ఐక్యూఏసీ డీన్ డాక్టర్ సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవుని భూములు అప్పగింత

విశాలాంధ్ర-మందస: మందస మండలంలో రట్టి వల్లభనారాయణస్వామి దేవాలయం భూములు ఆక్రమణకు గురి కాకుండా సర్వే జరిపారు. రెవిన్యూ, ఎండోమెంటు శాఖలకు చెందిన సర్వేయర్లు 112/1, 112/2, 112/3 సర్వే నెంబర్లులో గల 4 ఎకరాల 67 సెంట్లు భూమి సర్వే చేసి తమ శాఖకు అప్పగించారని స్థానిక దేవాదయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు టి.వాసుదేవరావు విలేకరులకు తెలిపారు. దేవాలయం భూములు అక్రమణ జరగలేదని, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న 112/5 సర్వే నెంబరులో రెవిన్యూ శాఖ పట్టాలిచ్చారని ఆయన వివరించారు. దేవాలయం భూముల విషయంపై త్వరలో నిర్ణయం తీసుకొని టెండరు పిలిచి లీజుకు ఇవ్వడం జరుగుతుందని, తమ శాఖ అనుమతులతో 11 సంవత్సరాలుపాటు లీజుకు ఇస్తామని ఆయన తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

యూనిటీ ఫౌండేషన్ డిమాండ్

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం పెదవంక గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనిటీ ఫౌండేషన్ అధ్యక్షులు పరపటి కిరణ్ మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చలవిడిగా చెత్త పెరిగిపోవడంతో దోమలు విపరీతంగా వస్తున్నాయని, కనీసం అధికారులు స్పందించక పోవడం సిగ్గుచేటని అన్నారు. అనేకసార్లు స్థానిక పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన ఫలితం లేదని అన్నారు. తక్షణమే మండల అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో సభ్యులు రవి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్‌పేటలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చెయ్యండి

హెూం మినిస్టర్ అనితకు ఎంఎల్ఏ మామిడి విజ్ఞప్తి

విశాలాంధ్ర-కొత్తూరు: పాతపట్నం నియోజిక వర్గం మండలకేంద్రం ఎల్.ఎన్ పేటలో కొత్తగా పోలీస్ స్టషన్ ఏర్పాటు చెయ్యాలని హెూం మినిస్టర్ వంగలపూడి అనితకు పాతపట్నం ఎంఎల్ఏ మామిడి గోవిందరావు విజ్ఞప్తి చేశారు మినిస్టర్ చెంబర్‌లో ఆమెను ఎంఎల్ఏ మామిడి స్వయంగా కలిసి ఎల్.ఎన్.పేటలో పోలీస్ స్టేషన్ ఆవశ్యకతను వివరించారు అదేవిధంగా ఒడిస్సా సరిహద్దుల్లో పాతపట్నం నియోజిక వర్గం పరిధి విస్తరించి ఉండడంతో గంజాయి, సారా అక్రమరవాణా పై పోలీస్‌లు దృష్టి సారించే టట్లు తగు చర్యలు తీసుకోవాలని హెూమ్ మంత్రిని కోరినట్లు ఎంఎల్ఏ మామిడి ఇక్కడ మీడియా కు తెలిపారు.

జెమ్స్ ఆధ్వర్యంలో 180మంది రోగులకు పరీక్షలు

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలో కరగాం పంచాయితీ నారాయణవలస గ్రామంలో మంగళవారం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, డా.ఎం,పుష్పభవాని ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 180మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, వి.సాయిసురేష్, క్యాంప్ ఫార్మశి, బి.శంకరరావు, పి.ఆర్.ఓ, సిహెచ్.పార్వతి, గ్రామ పెద్దలు, శిమ్మ లక్ష్మణరావు, వెలమల కామేష్, శిమ్మ అప్పన్న, అంగన్వాడీ కార్యకర్త, తవిటమ్మ, ఆశా వర్కర్, సతివాడ లక్ష్మి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన జెసిబి

విశాలాంధ్ర-టెక్కలి: జాతీయ రహదారిపై మంగళవారం ఓ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని జెసిబి వాహనం ఢీకొట్టింది. దీనితో వాహనదారుడు అక్కడకక్కడే పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదం పై టెక్కలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధిక మార్కులు సాధించిన విద్యార్థినికి ఆర్థిక ప్రోత్సాహం

విశాలాంధ్ర-రణస్థలం : గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజీ, శ్రీకాకుళం లో ఇంటర్మీడియట్ 2023 - 24 సంవత్సరం నాకు అత్యధిక మార్కులు సాధించినందుకు గాను, మా కళాశాల నుండి జి.సింహాచలం, హెచ్ఈసీ రెండవ సంవత్సరం విద్యార్థినికి మార్కులు 916 వచ్చినందుకు గాను బెజ్జిపురం యూత్ క్లబ్ వారు శ్రీకాకుళం డీవీఈవో ద్వారా రూ.10వేలు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు యూత్ క్లబ్ సిబ్బంది ఈ అమ్మాయిని అభినందించారు. ఇటువంటి అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

సోలార్ విద్యుత్ శాశ్వత పరిష్కారం

- విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం అందజేయవచ్చు
- ఎస్.ఇ నాగిరెడ్డి కృష్ణ మూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సోలార్ విద్యుత్ శాశ్వత పరిష్కారం,విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం అందజేయవచ్చు అని ఎస్.ఇ నాగిరెడ్డి కృష్ణ మూర్తి అన్నారు. ఏపీఈపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ మంగళవారం తన చాంబర్లో పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. పత్రికా సమావేశంలో మాట్లాడుతూ వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ గూగుల్ ప్లే స్టోర్ నుండి మరియు ఆపిల్ మొబైల్ యూసర్లు ఆపిల్ ప్లే స్టోర్స్ నుండి పి.ఎమ్. సూర్యఘర్ మొబైల్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్, పూర్తి పేమెంట్ మరియు పూర్తి సబ్సిడీ వివరములు తెలుసుకొనవచ్చున్నారు. మొబైల్ యాప్ యూజర్లు యాప్ డౌన్లోడ్ అనంతరం రాష్ట్రం, జిల్లా, విద్యుత్ సరఫరా సంస్థ పేరు, 15 అంకెల విద్యుత్ బిల్లు సర్విసు నెంబరు (గృహ వినియోగదారులు), విద్యుత్ బిల్లుకు అనుసంధానం అయిన మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ పొందుపరిచి ముందుగా రిజిస్టర్ కావలెను. మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్ అనంతరం మొబైల్ నెంబర్ తో లాగిన్ కావలెను. సోలార్ రూఫ్ టాప్ కొరకు తగు వివరములును అనగా కావలిసిన కిలో వాట్స్ మరియు సబ్సిడీ కొరకు బ్యాంక్ వివరములు పొందుపరిచి అప్లికేషన్ సమర్పించాలని, సోలార్ దరఖాస్తుదారుడు ప్రస్తుత గృహ వినియోగ కాంటాక్ట్ లోడ్ లేదా అంతకన్నా తక్కువ మాత్రమే వెబ్ పోర్టల్ నందు నమోదు చేయాలని, అనంతరం కిలోవాట్స్‌కి సంబంధించిన చార్జీలు చెల్లించా లన్నారు. విద్యుత్ వినియోగదారులు ఎవరికైనా "ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన" పథకంలో రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ను ఏర్పాటు చేసుకోవాలని అనుకుంటే సంబంధిత విద్యుత్ సిబ్బందిని కలిసి పూర్తి వివరములు తెలుసుకోవాలన్నారు ఈ అవకాశాన్ని గృహ విద్యుత్ వినియోగదారులు అందరూ వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన క్రింద నేటికీ 147 మంది దరఖాస్తు చేసుకోగా 37 మందికి సోలార్ రూఫ్ టాప్ ను అందజేయడం జరిగిందన్నారు. ఈ పథకం వినియోగదారులకు మాత్రమే అందు నిమిత్తం ఇంటింటికి ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరా లో ఎటువంటి అంతరాయం ఉన్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ జి సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ ఎస్ బయ్య న్నాయుడు , అలాగే సూర్య ఘర్ జిల్లా నోడల్ అధికారిగా బి.పెద్ది నాయుడు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు క్యాష్ అవార్డ్స్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలము దండుగోపాలపురం హైస్కూల్‌లో మొదటి మూడు స్థానాల్లో అత్యధిక మార్కులు విద్యార్థులు అప్పిని.కీర్తనకు 7000, అలజంగి షణ్ముఖప్రియకు 5000, రిక్కా.డింపుల్‌కు 4000 నగదు బహుమతితో పాటు, జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలు కోత సన్యాసమ్మ అప్పోజీ స్మారక అవార్డు ఆ సంస్థ ప్రతినిధులు అందజేసారు. అలాగే బాలికలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కింజరాపు.సాత్విక, లమ్మత.భువనకృతి, ఇచ్ఛాపురం.పావని లకు ఒక్కొక్కరికి 3000నగదుతో పాటులమ్మత.నారాయణమ్మ చిన్నయ్య స్మారక అవార్డు ప్రశంసాపత్రాలు అందజేసారు. ఇంగ్లీష్ & గ్రూపు సబ్జెక్టులలో ఎక్కువ మార్కులు పొందిన కకుష్ట.సృజనకు 4000, పిల్లల.శ్యామలకు3000, బెవర.గాయత్రిలకు 3000 నగదుతో పాటు కోతఅబ్బాయి సావిత్రమ్మ స్మారక అవార్డు ప్రశంసాపత్రాలు అందజేసారు. అలాగే అస్సాము రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కోత.రవి, ఐఐటి కి ఎంపికయిన నలుగురు విద్యార్థులు కీర్తన, షణ్ముఖప్రియ, సాత్విక, భూమికలకు ఒక్కొక్కరికి 5000 చొప్పున నగదు బహుమతిని మొత్తం 56000 నగదు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో, రిటైర్డ్ రాష్ట్ర వయోజన విద్యాడైరెక్టర్, మార్పు అమ్మాజీరావు, సంస్థ అధ్యక్షులు కోత.మదు, చినబాబు, ధర్మారావు, వడ్డితాండ్ర, కోటపాడు, దండుగోపాలపురము సర్పంచులు అశోక్, తిరుపతిరావు, సతీష్, అప్పలస్వామి, అప్పలరాజు, వసంతరావు, పొందల.రామకృష్ణ, హన్నురావు, అధ్యక్షులు భారతి, బాలరాజు,పాటశాలప్రదానోపాధ్యాయులు కోత చైతన్య ఈకార్యక్రమములో ఉపాధ్యాయులు తూట భాస్కరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: స్వచ్ఛంద సంస్థల సేవలు స్ఫూర్తిదాయకమని, మానవ సేవయే మాధవ సేవ అని నిరూపిస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో యునైటెడ్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరితో కలసి ఆటలాడుకునే వయసులో ఈ దీర్ఘకాలిక వ్యాధికి గురై చిన్నారులు పడుతున్న బాధలు వర్ణణాతీతమని చెప్పారు. ఇలాంటి పిల్లలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన యునైటెడ్ ఎన్‌జీవో స్‌కు పేరు పేరున అభినందనలు తెలిపారు. సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు నిరంతరం పని చేస్తూ తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తున్నాయన్నారు. సేవా మార్గంగా మణికంఠ బ్లడ్ బ్యాంకు వారు చేపడుతున్న కార్యక్రమాలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రిమ్స్ తలసేమియా చిన్నారులకు సదరం ఇవ్వడంలో జాప్యం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, రిమ్స్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అవసరమైతే ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తొందరలోనే ఈ సమస్య పరిష్కారం చూపుతానని తెలిపారు. ఈ సందర్భంగా తలసేమియా చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, టీడీపీ నాయకులు, ఎన్‌జీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంపకం తోనే వాతావరణ సమతుల్యత

- ఎస్ వి జే విద్యాసంస్థల మేనేజ్మెంట్ ఝాన్సీ

విశాలాంధ్ర-కవిటి: మొక్కలు పెంపకం తోనే వాతావరణ సమతుల్యత నెలకొంటుందని ఎస్ వి జే విద్యాసంస్థల మేనేజ్మెంట్ ఝాన్సీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎస్ వి జే విద్యా సంస్థలు ఆవరణంలో ఎన్ ఎస్ ఎస్1,2,డిగ్రీ వాలంటీర్స్ విద్యాసంస్థలు ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మానేజ్మెంట్ బి ఝాన్సీ చేతులు మీదుగా మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లుడూతూ మొక్కలు నాటడం విద్యార్థులు దినచర్యగా పాటించాలని చెట్లు పెంచడం వల్ల వాతావరణ సమతుల్యత కాపాడుతయని పర్యావరణం కోసం మనం ఎక్కువగా మొక్కలు నాటి వాటి రక్షణ కల్పంచాలని సూచించారు. ఈ కార్యక్రమం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.భాస్కర్ రావు,పీ సత్యం,ఎన్ ఎస్ ఎస్ పి ఒ ఆర్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బల్లిపుట్టుగలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బల్లిపుట్టుగ గ్రామంలో స్వర్గీయ మార్పు వంశీ కృష్ణ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం,మెడికల్ క్యాంప్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్ద బార్ల చిన్నబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ మెగారక్తదాన శిబిరంలో 30 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. 75 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాళి సాహు, ప్రదీప్, మున్నా, విశ్వ, సిసింద్రీ, మహేష్, రాము, రమేష్, హెల్పింగ్ హాండ్స్, స్పెషల్ గాయ్స్ ఫౌండేషన్, స్నేహిత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పీఏ పంతులు మరణం పట్ల ఏపీయూడబ్ల్యూజే సంతాపం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : సీనియర్ జర్నలిస్ట్, రచయిత పిఏ పంతులు (87) సోమవారం సాయంత్రం మరణించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ తొలి అధ్యక్షులుగా పనిచేసి, తుది శ్వాస వరకు ఈనెల పట్ల ఎంతో నిబద్ధతతో ఆయన ఉండే వారని ఐ జే యు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు తెలిపారు. ఆయనతోపాటు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ ఈశ్వరరావు, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవిమల్లేశ్వరరావు, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జగదీష్, చింతాడ అప్పలనాయుడు, సామ్నా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగూరు శ్రీనివాస్, కె చిన్నారావు, గరిమెళ్ళ ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఎస్ నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ తదితరులు పంతులు మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కలమటకు నామినేటెడ్‌లో అవకాశం

అనుచరుల్లో ఆశాభావం

విశాలాంధ్ర-కొత్తూరు : పాతపట్నం మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత జిల్లా టీడీపీ అధ్యక్షులు కలమట వెంకటరమణ మూర్తి కు త్వరలో ప్రభుత్వం నియమించనున్న నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఉంటుందా ? లేదా అన్న చర్చ ముఖ్యంగా పాతపట్నం నియోజిక్ వర్గం లో సాగుతుంది మిత్రపక్షాల కు సీట్లు సర్దుబాటు లేదా ఏదైనా కారణాల వల్ల ఈ ఎన్నికల్లో టీడీపీ టికెట్ దక్కని ముఖ్య నేతలు కు ఈ నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఉండొచ్చో అని ఆయన అనుచరులు భావిస్తున్నారు ఎంపీ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడు ల సహకారం కూడా మాజీ ఎంఎల్ఏ కలమట వెంకటరమణకు ఉంది .ఇది కాక నాడు ఎన్నికల్లో టీడీపీ టికెట్ రా కపోడం తో .ఇండిపెండెంట్ గా పోటీ కి సిద్ధమైన మాజీ ఏం.ఎల్ఎల్ కలమట ను.పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఒప్పించి పార్టీ అధికారం లోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తాం అని అన్నారు వెరసి. తొలి విడత నామినేటెడ్ పదవుల్లో పాతపట్నం మాజీ ఏం.ఎల్.ఏ కలమట కు ఏదైనా సరైన కార్పోరేషన్ ఛైర్మెన్ పదవి వచ్చే ఆవకాశం ఉందని ఆయన అనుచరులు గట్టి నమ్మకం తో ఉన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర-ఆమదాలవలస: రైతులు ఖరీఫ్ సీజన్లో వేసే పంట లు నమోదుకుగాను ఈ క్రాఫ్ట్ తప్పనిసరిగా నమోదు చేసుకో వాలని వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు తెలిపారు. మంగళవారం మండలం లోని సైలాడ, కుమ్మరిపేట, దివాన్జిపేట గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాఫ్ట్ బుకింగ్ పరిశీలించారు. అలాగే క్షేత్రస్థాయి పంటలను రైతులు చూపించారు. వాటిలో వాడవ లసిన ఎరువులు యాజమాన్య పద్ధతుల గూర్చి రైతులకు వివరించారు. అలాగే ఈ క్రాప్ నమో ద్వారా పంటల బీమా పంటల నష్టపరిహారం ధాన్యం కొనుగోలు వంటివి సులభ తరమవు తాయన్నారు. అలాగే సైలాడ రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి ఎరువులు పంపిణీ జరిగే విధానాన్ని వి ఏ ఏ రేణుక ని అడిగి తెలుసు కున్నా రు. మండలంలో 19 రైతు సేవ కేంద్రాల పరిధిలో13500 ఎకరాల లో పంటలను గుర్తించి నమోదు చేయాలని విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు వివరించారు.

తర్లి పాఠశాలలో సుబ్డిన్ భోజన కార్యక్రమం

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం తొగిరి పంచాయతీ తర్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో టిడిపి యువ నాయకుడు పిల్లా నందకిషోర్ సహకారంతో సుబ్డిన్ భోజన కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి యువనేత ప్రతిపాదించిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మరియు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తర్లి తెలుగుదేశం కార్యకర్తలు బోనే జోగారావు, కుజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజ్ అభివృద్ధికి రూ. 5 కోట్లు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆముదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి, అభివృద్ధికి ఐదు కోట్ల రూపాయ లను ప్రభుత్వం మంజూరు చేసిం ది. ఇటీవల కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము వారి స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రదానమంత్రి ఉచ్చతార్ శిక్ష అభియాన్ పి ఎం - యు ఎస్ హెచ్ ఏ ప్రొసీడింగ్స్ ఈనెల 10వ తేదీన మంజూరు చేయగా కళాశాలకు సోమవారం ఉత్తర్వులు అందాయి. ఆమదా లవలస శాసనసభ్యులు కూన రవికుమార్ కృషి ఫలితముగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో క్రొత్త నిర్మాణము కొరకు ప్రభుత్వము రూ.5.00 కోట్లు మంజూరు చేసి నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాల యం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు మంజూరు చేసినందుకు గాను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యు లునారా చంద్రబాబు నాయుడు కి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ఆమదాలవలస శాసన సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: వ్యవసాయ కళాశాల నైరాలో ఈనెల 12 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న యుంటి ర్యాగింగ్ అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భరత లక్ష్మి మాట్లాడుతూ కళాశాల నైరను ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్ గా ఉండాలని అభిళంసించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడపునాయుడు మాట్లుడుతూ కళాశాలలో గాని, హాస్టల్లో గాని ర్యాగింగ్ కు పాల్పడితే ఎటువంటి చట్టబద్ధమై, క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారో తెలియజేశారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి కె. నారాయణరావు మాట్లాడుతూ హారేగర్ తిరంగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం రూరల్ పోలిస్ స్టేషన్ వాసుదేవరావు, దిశా మహిళా పోలిస్ స్టేషన్ ఎస్సై బి. రేవతి, సెట్ శ్రీ మేనేజర్. వి.వి. అప్పలనాయుడు, వ్యవసాయ కళాశాల యాంటీ ర్యాగింగ్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త మత్స్యలేశంలో వైరల్ జ్వరాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం లోని డి.మత్స్యలేశం పంచాయతీ కొత్త మత్స్యలేశం గ్రామంలో వైరల్ జ్వరాలు సోకి 18 మంది బాధపడుతున్నారు. వీరిలో ఇద్దరు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో తాగునీటి బోర్లు వద్ద పారిశుధ్య పరిస్థితులు అధ్వాన్నంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. తాగునీటి బోర్ల వద్ద మురికినీరు నిల్వ, అక్కడే బట్టలు తడపడం తదితర కారణాలతో అపారిశుధ్య పరిస్థితులు నెలకొన్నట్టు గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గడచిన కొద్ది రోజులుగా పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టడంలేదని గ్రామస్థులు చెబుతున్నారు. పొన్నాడ పీహెచ్సీ వైద్య సిబ్బంది మంగళవారం గ్రామం లో ఇంటింటా సర్వే జరిపి వైద్య శిబిరాన్ని నిర్వహించి జ్వరపీడితులకు చికిత్స అందించారు. డీపీవో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రమాదేవిలు గ్రామాన్ని సందర్శించి వైద్య సిబ్బంది అందుబాటులో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. పారిశుద్ధి పరిస్థితులు మెరుగుపర్చాలని సూచించారు.

దుద్ది శ్రీనివాస్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే డాక్టర్ అశోక్

విశాలాంధ్ర-సోంపేట : సామాజిక సేవల్లో భాగంగా సామాజిక సేవకుడు ఎస్.ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దుద్ది శ్రీనివాస్ చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చేపట్టిన తల్లిపాల సరఫరా కేంద్రం ఏర్పాటు విషయంలో దుద్ది శ్రీనివాస్‌కు చెందిన ఎస్ఎస్ ఫౌండేషన్ అన్ని ఏర్పాట్లు నిర్వహించారు. తల్లిపాల సరఫరా కేంద్రానికి అవసరమైన వసతిని ఐసిడిఎస్ ఆలోచన మేరకు శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. అన్ని సదుపాయాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన శ్రీనివాస్ సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం కాంప్లెక్స్ ఆవరణలో ఎస్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో దుద్ది శ్రీనివాస్, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శేఖర్, సానా మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఐసీఐసీఐ బ్యాంక్ నూతన శాఖ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరంలోని అరసవల్లి రోడ్డులో ఐసీఐసీఐ బ్యాంకు కొత్త శాఖను ఏర్పాటు చేసింది. బ్రాంచిని శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐ.ఏ.ఎస్. ప్రారంభించారు. సేవింగ్స్, కరెంట్ అకౌంట్స్, ఫిక్సిడ్, రికరింగ్ డిపాజిట్లు వంటి ఖాతాలు, డిపాజిట్లతో పాటు వ్యాపార రుణం, గృహ రుణం, వ్యక్తిగత రుణం, వాహన రుణం, విద్యా రుణం తదితర రుణాలు, అలాగే రెమిటెన్స్ మరియు కార్డ్ సర్వీసులు మొదలైన విస్తృత శ్రేణి సేవలను ఈ బ్రాంచ్ సమగ్రంగా అందిస్తుందనీ బ్యాంకు ప్రతినిధులు చెప్పారు. ప్రాంగణంలో లాకర్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందనీ, ఈ బ్రాంచ్ సోమవారం నుంచి శుక్రవారం వరకు, నెలలో మొదటి, మూడో, అయిదో శనివారాల్లో ఉదయం 9.30 గం.ల నుంచి సాయంత్రం 3.00 గం.ల వరకు పని చేస్తుందన్నారు. ఉద్యోగి ట్యాబ్లెట్ డివైజ్ ద్వారా కస్టమరు ఉన్న చోటే దాదాపు 100 సర్వీసులను అందించడానికి వీలు కల్పించే ట్యాబ్ బ్యాంకింగ్ సదుపాయాన్ని కూడా ఈ శాఖ అందిస్తుందనీ, ఖాతాలు, ఫిక్సిడ్ డిపాజిట్లు (ఎఫ్‌డి) తెరవడం, చెక్ బుక్ రిక్వెస్ట్ రైజ్ చేయడం, ఈ-స్టేట్మెంట్స్ జనరేట్ చేయడం, చిరునామా మార్పులు మొదలైన సర్వీసులు ఇందులో లభిస్తాయనీ తెలిపారు.

కేటి రోడ్‌లో ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్ లో కోర్టు తీర్పు ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ అధికారులు ఆక్రమణలను తొలగించారు. జంట పట్టణాల్లో ఎక్కడ లేని విధంగా ఆంధ్ర బ్యాంక్ రహదారిలో 100 అడుగుల రోడ్డును నాలుగు దశాబ్దాల కిందట ప్రముఖ సంఘ సంస్కర్త పెంట గున్నయ్య ఆ స్థలాన్ని ఉచితంగా అప్పట్లో పంచాయతీకి అప్పగించారు. కాలక్రమేనా జంట పట్టణంలో అభివృద్ధి చెందడం, వ్యాపార కేంద్రంగా మారడంతో 100 అడుగుల రహదారి ముందు భాగాన దివంగత పెంట గున్నయ్య వారసుడు ఆ స్థలం తనదేనంటూ ఆక్రమించుకొని బండి దుకాణదారులకు అద్దెలకు ఇచ్చాడు. నెలనెలా దుకాణదారుల నుండి హద్దులు వసూలు చేసుకునేవాడు. ఈ నేపథ్యంలో వైసీపీ పాలనలో రోడ్ అభివృద్ధి చేసేందుకు అప్పటి మంత్రి డా. అప్పలరాజు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆ రహదారిలో కాంట్రాక్టర్ మొదలవలస మన్మధరావుతో సిమెంట్ రోడ్లు వేయించారు. అయితే పూర్తిగా సిమెంట్ రోడ్డు వేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్న తరుణంలో ఆక్రమణ అడ్డుకోవడంతో అసంపూర్తిగా సిమెంట్ రోడ్డు వేశారు. ఈ వ్యవహారంపై మున్సిపాలిటీ అధికారులు ఆ స్థలం మున్సిపాలిటీ కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు ఇటీవల రావడంతో ఆర్డర్ కాపీ తో మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది ఆక్రమణలు తొలగించారు. ఈ రహదారి అభివృద్ధి చేస్తే జంట పట్టణాలకు తల మాణికముగా తయారవుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1200 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

విశాలాంధ్ర-మెలియాపుట్టి: మెలియాపుట్టి మండల పరిధిలో గల ఎస్సీపీ కొత్తూరు పరిసర ప్రాంతాలలో 1200 లీటర్ల పులిసిన బెల్లం ఊటలతో పాటు 20లీటర్ల నాటు సారాయిని ధ్వంసం చేసినట్లు ఎస్.సి.బి అధికారులు తెలిపారు. శ్రీకాకుళం ఎన్ఫోర్స్మెంట్ సూపరిండెంట్ తిరుపతిరావు నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం వెళ్లి మండల పరిధిలో గల ఎస్సీపీ కొత్తూరు పరిసర ప్రాంతాలలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా 1200 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు, 20 లీటర్ల నాటు సారాయిని పట్టుకున్న పట్టుకొని ధ్వంసం చేసినట్లు చెప్పారు. దీనిలో టెక్కలి ఎస్.సి.బి సీఐ రాజశేఖర్ నాయుడు, మరియు సిబ్బంది ఉన్నారు.